# మీరు చదివారా?



## - కృష్ణవేణి



(నెలనెలా ఓ పుస్తకం - సమగ్రపరిచయం)

## Namesake/సమాన నామధేయుడు



నిలంజన్ సుధేష్ణ 'ఝుంపా 'లహిరీ, పశ్చిమ బెంగాల్ నుంచి లండను వలస వెళ్ళిన తపతి, అమర్‌ల దంపతులకు 1967లో పుట్టారు. ఆమెకి రెండేళ్ళుండగా తల్లితండ్రులు అమెరికాకి మారారు. పిల్లలు బెంగాలీ సంస్కృతి మరచిపోకుండా ఆమె తల్లి వారిని తరచూ కలకత్తా తీసుకెళ్ళేవారు.
స్కూల్లో చేర్చినప్పుడు పూర్తి పేరు ఉచ్చరించలేకపోయిన టీచర్, ఆమెని ముద్దుపేరైన 'ఝుంపా' అని పిలవడం మొదలెట్టారు. తన పేరు తనకు సిగ్గు కలుగజేసేదని రచయిత్రి అంటారు. ఆమె బెర్నార్డ్ యూనివర్సిటీలో ఇంగ్లీష్ చదివి, అక్కడే పిఎచ్‌డి చేశారు.
లహిరీ–తన మొదటి కథల సంకలనం అయిన 'ఇంటర్‌ప్రెటర్ ఆఫ్ మెలొడీస్(1999)' కి పులిట్జర్ పొందారు. అయితే, దీనికి ముందు ఆమె రాసిన కథలన్నిటినీ పబ్లిషర్లు నిరాకరించారు. 'ద నేమ్‌సేక్' (2003)పుస్తకం, ఇదే పేరుతో 2006లో సినిమాగా వచ్చింది. కథ– కలకత్తా, బోస్టన్, న్యూయోర్క్‌లో జరిగిన సంఘటనలమీద ఆధారపడినది. ఆ తరువాత, రచయిత్రి– నథానియల్ హాథోర్న్ రాసిన 'స్కార్లెట్ లెటర్' పరిచయం నుంచి తీసుకున్న పేరుతో రాసిన, 'అన్‌ఎకస్టమ్డ్ ఎర్థ్' నవల 2008లో వచ్చింది. లహిరీ 2013లో రాసిన 'లోలాండ్' మాన్ బుకర్ ప్రైజ్‌కు షార్ట్ లిస్ట్ అయింది. ఆమె పుస్తకాలన్నీ వలసదారుల అనుభవాల వల్ల ప్రేరణ పొందినవే.
2001లో లహిరీ టైమ్ పత్రికకి పని చేసే అల్బెర్టో బుష్‌ని పెళ్ళి చేసుకున్నారు. ఇద్దరు పిల్లలు. ప్రిన్స్టన్ యూనివర్సిటీలో క్రియేటివ్ రైటింగ్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.




★★★

కలకత్తాలో పెళ్ళి చేసుకుని 1968లో అమెరికా వలస వచ్చిన ఆషిమా, అశోక్ గంగూలీ దంపతుల్లో– ఆషిమాకి ఇంగ్లీష్ కవిత్వం ఇష్టం అయితే, భర్తకి రష్యన్ రచయితలు. తమ మొదటి బిడ్డ పుట్టుకకోసం మాసుచిసెట్స్‌లో ఉన్న కేంబ్రిజ్ హాస్పిటల్లో ఉండి, ఎదురు చూస్తుంటారు. కొడుకు పుడతాడు.
కాగితాలమీద పసికందు పేరు ఉంటే తప్ప హాస్పిటల్ వదలే వీలు లేదని అక్కడి స్టాఫ్ చెప్తారు.
ఏ కుటుంబ పెద్దో పుట్టిన బిడ్డకి పేరెంచే బెంగాలీ సాంప్రదాయం వల్ల, ఆషిమా నాయనమ్మ వాగ్దానం

చేసినట్టుగా ఆమె వద్దనుండి ఏదైనా పేరు సూచిస్తూ ఉత్తరం వస్తుందేమోనని గంగూలీ జంట ఎదురు చూసినప్పటికీ, అది రాదు. అశోక్- నవజాత శిశువు ముద్దు పేరు బర్త్ సర్టిఫికెట్ మీద రాయిస్తాడు. అది రష్యన్ రచయిత, నికొలై గోగో పేరుని కుదించిన 'గోగో.' అదే పేరు ఎందుకు! అన్నదాని కారణం: అశోక్ కలకత్తాలో రైలు ప్రయాణం చేస్తూ, రచయిత రాసిన కథా సంకలనం చదువుతూ ఉన్నప్పుడు రైలు ఆక్సిడెంట్ అవుతుంది. అతను పక్కనున్న పొలంలో వెళ్ళి పడతాడు. పుస్తకపు పేజీలని ఊపుతూ రక్షణ టీంలో ఉన్న డాక్టర్లకి తానికా బతికే ఉన్నానని సూచించినప్పుడు, వారతన్ని కాపాడుతారు. ఆ సంపుటివల్లే తనింకా ప్రాణాలతో ఉన్నాననుకున్న అశోక్ నమ్మకం కొడుకు పేరుగా మారుతుంది. అతని ఆ జ్ఞాపకం నవలంతటా కనిపిస్తూనే ఉంటుంది.

గోగో పేరుకి స్వాభావిక ప్రాముఖ్యత ఉన్నప్పటికీ, ఇంటి బయట కొడుకుని ఆ పేరుతో ఎవరూ పిలవాలన్న ఉద్దేశ్యం మాత్రం ఉండదు తల్లితండ్రులకి. కాబట్టి గోగోని కిండర్ గార్డెన్‌లో చేర్చినప్పుడు, కొడుకు పేరు 'నిఖిల్' అని రాయమని టీచర్లకి చెప్తారు. టీచర్లు కుర్రాడినే 'నిన్నే పేరు పెట్టి పిలవాలి?' అని అడిగినప్పుడు, పిల్లాడు 'గోగో' అనే చెప్పినందువల్ల, ఆ పేరే స్కూల్ పాస్ అయేవరకూ స్థిరపడుతుంది.

గంగూలీ దంపతులకి కూతురు పుట్టినప్పుడు ' సోనియా' అన్న పేరు పెడతారు. వారు కలిసేదీ, పండుగలు జరుపుకునేదీ సాటి బెంగాలీలతోనే. వండే వంటలూ, వస్త్రధారణా బెంగాలీ సంస్కృతికి సంబంధించినవే.

పెరిగి పెద్దవుతున్నకొద్దీ తన వింత పేరు గోగోకి కంపరంగా అనిపించినప్పుడు, కొడుక్కి ఆ కథల సంపుటి బహుమానంగా ఇచ్చిన అశోక్, తాము ఆ పేరే ఎందుకు ఎందుకు ఎంచుకున్నారో అని వివరించడానికి ప్రయత్నిస్తాడు. అయినప్పటికీ, ఒక రష్యన్ రచయిత ఇంటి పేరుకీ తనకీ సంబంధమేమిటో అని గోగో ఊహించలేకపోయినప్పుడు, కారణం అర్థం చేసుకునే వయస్సుకింకా కొడుకు చేరలేదని గ్రహిస్తాడు.

గోగో 18వ యేట, చట్టబద్ధంగా తన పేరు నిఖిల్‌గా మార్చుకుంటాడు. అయితే, తల్లితండ్రులు కానీ వారి స్నేహితులు/వారి పిల్లలూ కానీ తనని గోగో అని తప్ప ఇంకే పేరుతోనూ పిలవరని అతనికి తెలుసు. తన తల్లితండ్రుల బెంగాలీ సంస్కృతిని తిరస్కరించి అమెరికన్‌లా బతుకుదామనుకున్న అతని అనేక ప్రయత్నాలలో ఈ పేరు మార్పు మొదటిది. తండ్రిలా ఎమ్ఐటిలో కాక, యేల్ యూనివర్సిటీలో చేరడానికి నిర్ణయించుకుంటాడు. అమెరికన్ అమ్మాయిలని మాత్రమే డేట్ చేస్తాడు. ఈ చర్యలవల్ల తల్లితండ్రులని నిర్లక్ష్యపెడతాడు కూడా. అయితే, అతని కాలేజిలో థాంక్స్ గివింగ్ రోజున తండ్రి- గోగో పేరుకున్న మూలాలని కొడుక్కి వివరిస్తూ, *'పుస్తకాలున్నది ఇందుకోసమే అని మా తాతగారు చెప్పేవారు: ఒక్క ఇంచీ కూడా కదలకుండా ప్రయాణాలు చేసేటందుకు.'* అని చెప్పినప్పుడు, తను పేరు మార్చుకున్నందుకు గోగో పశ్చాత్తాపపడ్డం ప్రారంభిస్తాడు.

అతను న్యూయార్క్‌లో ఆర్కిటెక్ట్‌గా పని చేస్తున్నప్పుడు, ధనిక కుటుంబానికి చెందిన మాక్సీన్ అన్న అమ్మాయితో ప్రేమలో పడతాడు. తన తల్లితండ్రులతో పోల్చి చూస్తే పూర్తిగా భిన్నంగా ఉండే ఆమె ఇంటివారితో సౌకర్యవంతంగా అనిపించి, ఆ కుటుంబంతో ఎక్కువ సమయం వెచ్చిస్తూ తన స్వంత అమ్మానాన్నాతో తక్కువ సమయం గడపడం మొదలెడతాడు. కొంతకాలం తరువాత మాక్సీన్ ఇంటికే మారతాడు.

ఒహాయో యూనివర్సిటీలో బోధిస్తూ హటాత్తుగా గుండెపోటు వచ్చి అశోక్ మరణించినప్పుడు, గోగో- తండ్రి అపార్టుమెంటుకి వెళ్ళి కుటుంబంతో పాటు బెంగాలీ కర్మకాండల్లో పాలు పంచుకుంటాడు. మాక్సీన్ కూడా పాటు వెళ్తుంది కానీ బెంగాలీ సాంప్రదాయాలు తెలియకపోవడంతో, అంటీముట్టనట్టు ఉంటుంది. ఆమెకి నెమ్మదిగా దూరం అవుతూ ఆఖరికి ఆ సంబంధానికి దూరం తొలుగుతాడు గోగో.

ఒక సంవత్సరం గడిచాక తల్లి- మౌషుమి అనే అమ్మాయికి కలుసుకొమ్మని కొడుకుతో చెప్తుంది. ఆ అమ్మాయి అమెరికన్ బోయ్ ఫ్రెండు అయిన గ్రహమ్‌తో అయిన నిశ్చితార్థాన్ని తెంచేసుకున్న గోగో చిన్నప్పటి స్నేహితురాలు. గోగో, మౌషుమి కలిపి తిరగడం ప్రారంభించి, తమ ఇండియన్-అమెరికన్ నేపథ్యం వల్ల తలెత్తిన ఇబ్బందులతో పాటు అనేకమైన విషయాల గురించి ఏకాభిప్రాయానికి వచ్చి, ఆఖరికి పెళ్ళి చేసుకుంటారు. కాకపోతే, మౌషుమి తనకి గతంలో పరిచయం ఉన్న దిమిత్రీతో సంబంధం పెట్టుకుందని గోగోకి తెలియడానికి ఎక్కువ కాలం

పట్టదు. ఇద్దరూ విడాకులు పుచ్చుకుంటారు.

చెల్లెలు సోనియా– బెన్ అనే యువకుడిని పెళ్ళి చేసుకుంటున్నప్పుడు, గోగో పెళ్ళి ఏర్పాట్లకోసం తన చిన్నప్పటి ఇంటికి వెళ్తాడు. తనకి పద్నాలుగేళ్ళుండగా తండ్రి తనకి ఇచ్చిన రష్యన్ కథల పుస్తకాన్ని చూస్తాడు. దానిమీద తండ్రి రాసిన *'గోగో గంగూలీకోసం: నీకు తన పేరు ఇచ్చిన ...నీకు నీ పేరిచ్చిన వ్యక్తి నుండి.'* అన్న మాటలు చదివి, సమాన నామధేయుడు మొట్టమొదటిసారిగా తండ్రికి ఇష్టమయిన పుస్తకాన్ని చదవడం ప్రారంభిస్తాడు.

★★★

పుస్తకంలో లహిరి– భారతదేశం, అమెరికాల మధ్య ఉండే తేడాలని చూపిస్తారు. ఆమె పరిశోధనలో కొంతమట్టుకు ఇండియన్ వలసదారులైన తల్లితండ్రులకి పుట్టి, అమెరికాలో పెరిగిన తన అనుభవాలమీదా, తన బెంగాలీ స్నేహితుల అనుభవాలమీదా ఆధారపడినది. అయితే, 'నేమ్‌సేక్' సృజనాత్మక రచన కూడా కనుక ఇక్కడ లహిరీ కాల్పనిక ప్రతిరూపం గోగో గంగూలీ.

మొదటి తరపు వలసదారులకీ, అమెరికాని తమ దేశంగా చేసుకున్న వారి పిల్లల తరానికీ మధ్య ఉన్న తేడామీద, నవల కేంద్రీకరిస్తుంది.

కథాకాలం: 1968–2000 నాటిది.

రెండు విభిన్న సంస్కృతులను సమన్వయ పరుస్తూ– పేరుకీ, ఉనికికీ ఉన్న సంబంధాన్ని గుర్తించడానికి చేసిన ప్రయత్నం ఇది. నవల్లో దృష్టికోణాలు మారుతూ ఉన్నప్పటికీ ప్రధాన భాగం– ఆషిమా, అషోక్, గోగో గొంతులతో వినిపించేదే. రెండు తరాల పరిస్థితినీ సున్నితమైన శైలిలో వివరించిన పుస్తకపు ఆధారంగా, మీరా నాయర్ సినిమా ఇదే పేరుతో సినిమా తీశారు

COMMENTS